# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 329 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 12, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## ఒడిషా సిఎంగా మోహన్ చరణ్ మాఝీ ఎంపిక



**భువనేశ్వర్,జూన్11(నమస్తే ఉదయం):** ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ ఎంపికయ్యారు. డిప్యూటీ సీఎంలుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిదా లకు అవకాశం లభించింది. మాఝీని బీజేపీ శాసనసభా పక్ష నేతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మోహన్ మాఝీ కియోంజర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. వీరు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ , బీజేపీ అగ్రనేతలు, పార్టీ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 147 స్థానాలకు గాను 78 సీట్లు గెలుచుకుని తొలిసారిగా రాష్ట్రంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చింది. 2000, 2004లో బీజేడీ కూటమి భాగస్వామిగా బీజేపీ రాష్ట్రాన్ని పాలించింది.

### తూర్పు ఆఫ్రికా దేశమైన

# మలావీలో ఘోరం



**విమాన ప్రమాదంలో ? ఉపాధ్యక్షుడు దుర్మరణం**

**భార్య సహా..తొమ్మిదిమంది మృత్యువాత**

**న్యూఢిల్లీ,జూన్11(నమస్తే ఉదయం):** తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారం నాడు ఈ విషయాన్ని అధికారికంగా మిగతా.. 2లో

# తెలంగాణ మంత్రులకు ల్యాండ్ క్రూజర్లు

**కేటాయించిన ప్రోటోకాల్ విభాగం**




**హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం):** సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని మంత్రులందరికీ కొత్త ల్యాండ్ క్రూజర్ కార్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో మంత్రికి ఒక్కో ల్యాండ్ క్రూజర్‌ను కేటాయించారు. ఈ వాహనాలకు ఆయా మంత్రులు పూజలు కూడా నిర్వహించారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రికి మాత్రమే ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్ ల్యాండ్ క్రూజర్ కార్లను సమకూర్చేది. ఇకపై మంత్రులకు కూడా ల్యాండ్ క్రూజర్ వాహనాలను ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్ సమకూర్చింది. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు అంటూనే మరో వైపు మంత్రులకు ల్యాండ్ క్రూజర్ కార్లను కేటాయించడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇటీవల విజయవాడలో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన అనంతరం మంత్రులకు వాహనాలను ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్ కేటాయించింది.

# వామ్మో జూన్..

**మళ్లీ ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత - ఆందోళనలో తల్లిదండ్రులు**

**స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టండి**

**అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు**




**నిజామాబాద్,జూన్11(నమస్తే ఉదయం):** జూన్ అంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నెలలోనే విద్యాసంస్థలు, వ్యవసాయపనులు ప్రారంభమవుతాయి. ఈ నెల 12 నుంచి కొత్తవిద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల చదువుకు పెట్టే ఖర్చులపై తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకునేవారు ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అడ్మిషన్, డొనేషన్ ఫీజులు చూసి జంకుతున్నారు. ఇదివరకే చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుతో తల్లిదండ్రులకు జేబులకు చిల్లుపడనుంది. దీంతో 'వామ్మో జూన్' అంటూ తలపట్టు కుంటున్నారు. ఒక వైపు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి, ఏయే స్కూల్‌లో ఏ స్థాయి ఫలితాలు వచ్చాయి, తదితర అంశాలపై తల్లిదండ్రులు విశ్లేషించుకుంటున్నారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. బుక్స్, యూనిఫాం, పెన్నులు, పెన్సిల్ ఇతరాత్ర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. మరోవైపు వానాకాలం సీజన్ మొదలవ్వడంతో రైతులు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులకు డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూనే బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఈనెల ఎలా గట్టేక్కుతుందా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి కుటంబీకుల జేబులకు చిల్లుపడే మాసం వచ్చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 పైగా ప్రైవేట్ పాఠశాలల్లో వాటి విద్యాప్రమాణాలు, ఇతర అంశాలతో కూడిన స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి మొదలుకొని రూ.లక్షకు పైగా ఫీజులున్నాయి. అందులోనూ ఐఐటీ, ట్యూషన్, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలు నేర్పించేందుకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్నాయి. వీటిలో కొన్ని తోకల పేరుతో 1వ తరగతికే రూ.లక్షల్లో వసూలు చేయడం విశేషం. కొన్ని పాఠశాలలైతే నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అప్పు చేసైనా ప్రైవేట్ స్కూల్ అనేది వేళ్లానుకోవడంతో దిగువ, మధ్య తరగతి జనం మిగతా.. 2లో

# తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

**96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత**

**హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం):** తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలను ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీ వర్సిటీ ఇంఛార్జి విసి నవీన్ మిట్టల్ విడుదల చేశారు. మొత్తం 96.90 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం టీజీ ఎడ్‌సెట్ పరీక్షను మే 23న నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మొత్తం 29, 463 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా.. ఈసారి ఎడ్‌సెట్ పరీక్షలను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో మొత్తం 14, 285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ ఎడ్‌సెట్ హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో మొత్తం 96.90 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఎడ్‌సెట్ పరీక్షకు 27,495 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26,994 అభ్యర్థులు (98.18శాతం ) ఉత్తీర్ణత సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే 23న రెండు సెషన్లలో టీజీఎడ్‌సెట్-2024 పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 16,929 మందికి గానూ 14,633 మంది, మిగతా.. 2లో



## విద్యుత్ కొనుగోళ్ల దర్యాప్తు

**కెసిఆర్‌కు నోటీసులు జారీ**

**హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం):** తెలంగాణలో విద్యుత్ కొనుగోళ్ల అంశంలో దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి తెలిపారు. యాదాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ కరెంటు కొనుగోలుకు గత ప్రభుత్వం అనుసరించిన విధానంపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ నరసింహారెడ్డి జ్యుడిషియల్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈ అంశంలో కేసీఆర్, సురేశ్ చందా, అజయ్ మిశ్రా సహా 25 మందికి నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. వివరణ ఇచ్చేందుకు కేసీఆర్ జులై 30 మిగతా.. 2లో

### ఆహారం కల్తీ చేస్తే

# కఠిన చర్యలు..!

**మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరిక**

**హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం):** ఆహారం కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమిషనర్ ఫుడ్ సేఫ్టీ' ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్, నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్, ఆయిల్ మర్చంట్ అసోసియేషన్, బార్ అండ్ రెస్టారెంట్స్, ఇండియన్ డైరీ మిల్క్ ప్రొడక్ట్స్ అసోసియేషన్, తెలంగాణ ప్యాకేజెడ్ డ్రింకింగ్ వాటర్ అసోసియేషన్, తెలంగాణ రోలర్ ఫ్లోర్ మిలర్స్, బేకరీ అండ్ ఐస్ క్రీమ్స్ అసోసియేషన్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని వివిధ అసోసియేషన్ ప్రతినిధులకు



సూచించారు. నిజాం కాలం నుంచి హైదరాబాద్ బిర్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందన్నారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దు తున్నామన్నారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నామన్నారు. హోటల్స్ యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వర్క్ షాప్‌ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు.



### పరుగులు తీస్తున్న

# కృష్ణమ్మ...

**జూరాలకు పెరుగుతున్న వరద ఉధృతి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**

కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కృష్ణమ్మ జూరాల కు పరుగులు తీస్తోంది. తంగిడి ఎగువ భాగంలో భీమా నదిపై ఉన్న గిరిజాపూర్ డ్యామ్ గేట్ల పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో వరద జలాలు సైతం కృష్ణానదీలోకి కలుస్తుండటంతో మక్తల్ మండల పరిధిలోని పసుపుల గ్రామం వద్ద శ్రీపాద వల్లభుని ఆలయం సమీపంలో క్రిష్ణమ్మ నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతోంది. అటు నుంచి కృష్ణమ్మ జూరాల వైపు పరుగులు తీస్తోంది. జూరాలకు జల కళ సంతరించిపోయింది.

**జూరాలకు పెరుగుతున్న వరద**

సాగు, తాగునీటి కోసం గత యాసంగిలో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డ నడిగడ్డ ప్రజలకు వరుణదేవుడి కరుణతో ముందస్తు వర్షాలు మురిపించాయి. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు కృష్ణా పరివాహక ప్రాంతాలు, జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు వచ్చి నీరు చేరుతుండడంతో రోజు రోజుకూ ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. మంగళవారం జూరాల జలాశయానికి ఎగువ ప్రాంతం నుండి 7,211 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో జూరాల జలాశయంలో 5.547 టిఎంసిల నీరు నిల్వ ఉంది. దీంతో ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుండి వరద రాకున్నప్పటికీ వర్షపు నీరు మిగతా.. 2లో


# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో చంద్రబాబు భేటీ

**మద్దతు లేఖల సమర్పణ..ప్రమాణానికి అనుమతి**

**అంతకుముందే గవర్నర్‌ను కలసిన కూటమి నేతలు**

**ఎన్‌డిఎ నేతగా చంద్రబాబును ఎన్నుకున్న లేఖ అందచేత**

**విజయవాడ,జూన్11(నమస్తే ఉదయం):** ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడానికి రంగం సిద్దం అయ్యింది. దీనికి సంబంధించిన ప్రక్రియ కూడా పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నారా చంద్రబాబు నాయుడును గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానించారు. ఆ క్రమంలో తనకు మద్దతు ఇచ్చిన 163 మంది ఎమ్మెల్యేల జాబితాను ఈ సందర్భంగా గవర్నర్‌కు చంద్రబాబు అందజేశారు. భేటీ అనంతరం రాజ్‌భవన్ నుంచి ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు కూటమి నేతలు అచ్చన్నాయుడు, నాదెండ్ల మనోహన్, పురందేశ్వరిలు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలసి చంద్రబాబును నాయుకుడిగా ఎన్నికున్నట్లు లేఖ అందించారు. ఆయనను సిఎంగా ఆహ్వానించాలని కోరారు. దీంతో చంద్రబాబు ప్రమాణానికి లైన్ క్లీయర్ అయ్యింది.



రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్డీయే కూటమి నేతలు కలిశారు. టీడీపీ తరపున అచ్చెన్నాయుడు, బిజెపి నుంచి పురంధేశ్వరి, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ గవర్నర్‌ను మిగతా.. 2లో



### వారసులకే మంత్రిపదవుల్లో

# పెద్దపీట

**ఎన్‌డిఎ మంత్రివర్గం 'పరివార్ మండల్'**

**పలువురి పేర్లు ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శలు**

**న్యూఢిల్లీ,జూన్11(నమస్తే ఉదయం):** ఆనువంశిక రాజకీయాలపై మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మిగతా.. 2లో

# నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

**సంస్థాగత మార్పులపై బిజెపి దృష్టి**

**రాష్ట్రాల్లోనూ బిజెపికి కొత్త అధ్యక్షులపై దృష్టి**

న్యూఢిల్లీ,జూన్11(నమస్తే ఉదయం): కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భాజపా .. తాజాగా పార్టీ సంస్థాగత మార్పులకు సిద్ధమైంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీంతోపాటు పార్టీ జాతీయాధ్యక్షుడి ఎంపిక, రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు, పార్టీ అధ్యక్షుల మార్పు వంటి అంశాలపై కాషాయ పార్టీ దృష్టి సారించినట్లు సమాచారం.
భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా.. తాజాగా కేంద్ర మంత్రివర్గంలో చేరారు. పార్టీ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలాన్ని ఇటీవల ఆరు నెలలు పొడిగించగా.. అది కూడా జూన్ 30తో ముగియనుంది. దీంతో పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు నడ్డా పదవీ కాలాన్ని భాజపా పార్లమెంటరీ బోర్డు పొడిగించే అవకాశం ఉన్నప్పటికీ దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుడి ఎంపికకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా.. కేంద్రం హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నడ్డా.. జనవరి 2020లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం




చేయడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీని పటిష్ఠ పరిచేందుకు శాయశక్తులా కృషి చేసే సీనియర్ నేతకు పార్టీ పగ్గాలు అప్పజెప్పాలనేది ప్రధాని మోదీ నిర్ణయమని.. అందుకే జేపీ నడ్డాను అప్పట్లో ప్రభుత్వంలోకి తీసుకోలేదన్న సంకేతాన్ని పంపించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ వంటి సీనియర్ల నేతల పేర్లు వినిపించినప్పటికీ ప్రస్తుతం వాళ్లు కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతుండడంతో వారికి ఆ అవకాశం రానట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాల నుంచి కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం లేదా జాతీయ కార్యదర్శుల్లో ఒకరికి అధ్యక్ష పగ్గాలు అప్పగించవచ్చనే వాదన వినిపిస్తోంది. వీటితోపాటు పలు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను మార్చే యోచనలో భాజపా ఉన్నట్లు తెలుస్తోంది.
ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భారీగా నష్టపోయిన పార్టీ.. అధ్యక్షుడిగా కొత్త ముఖాన్ని పరిచయం చేయనున్నట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సుకాంత మజుందార్ కేంద్ర మంత్రి కావడం, బిహార్ పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతుండటం, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ చేతుల్లోనే పార్టీ పగ్గాలు ఉండటంతో ఆయా రాష్ట్రాల అధ్యక్షుల మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో రాజస్థాన్‌లో భాజపా అధ్యక్షుడిని మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# బాబు ప్రమాణస్వీకారానికి రేవంత్‌కు అందని ఆహ్వానం

**కాంగ్రెస్ సిఎం కావడం వల్లనే దూరం పెట్టినట్లు సమాచారం**

హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్న వేళ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందలేదు. కేవలం ఎన్‌డిఎ మిత్రులకు, సిఎంలకు మాత్రమే ఆహ్వానాలు అందినట్లు సమాచారం. ఈ క్రమంలో కాంగ్రెస్ సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డికి ఆహ్వానం పంపలేదు. అందుకే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అహ్వానం అందలేదు. మొదటి నుండి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నా రేవంత్ రెడ్డి టీడీపీలోనే ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా పని చేశారు. అనంతరం రాజకీయ అనివార్యతతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2023 డిసెంబర్‌లో రేవంత్ రెడ్డి సీఎం కాగానే చంద్రబాబు ఫోన్ చేసి అభినందించారు. అనంతరం జరిగిన ఏపీ ఎన్నికల్లో చంద్రబాబు ఘన విజయం సాదించారు. తాజాగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర వాతావరణం ఉండాలని, విభజన చట్టాలను స్నేహపూర్వక వాతవరణం అమలు చేసుకోవాలని ఇరువురు అభిప్రాయాపడ్డారు. ఈ పరిణామాలతో తాజాగా ఏపీలో జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రేవంత్ రెడ్డి హాజరవుతారని అందరు అనుకున్నారు. కానీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఇప్పటి వరకు ఎలాంటి అహ్వానం అందలేదని తెలుస్తోంది. దీంతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్ రెడ్డి హజరు కావడం లేదని సమాచారం. సాధారణంగా ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారాలకు పక్క రాష్ట్రాల సీఎంలను పిలవడం అనావాయితీ. గతంలో ఏపీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తెలంగాణ సీఎంగా ఉన్న కేసిఆర్ హజరయ్యారు. కానీ ఇప్పుడు తెలుగుదేశం ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉండటం, తెలంగాణలో ఇండియా కూటిమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో, ఆహ్వానం ఇవ్వలేదని తెలుస్తోంది. ఇక అటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి వస్తుండటంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, ఇండియా కూటమి నేతలు వేదికను పంచుకోవడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యం లోనే రేవంత్ రెడ్డికి ఏపీ సర్కార్ ఆహ్వానం పంపకపోవడానికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

## సిఎం రేవంత్‌తో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ

హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం): పట్టభద్ర ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నల్గొండ – వరంగల్ – ఖమ్మం శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలి ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సందర్భంగా సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కలిసిన వారిలో ఉన్నారు. సభా నాయకుడిగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ చేసిన తీర్మానాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. 164 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు ఎన్డీయే కూటమి నేతలు లేఖ ఇచ్చారు. ఈ తీర్మానాన్ని పరిశీలించిన గవర్నర్.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కూటమి నేతలను ఆహ్వానించారు.
గవర్నర్‌తో భేటీ అనంతరం కూటమి నేతలు మీడియాతో మాట్లాడారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటు అంశాలను వివరించామని తెలిపారు. శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును మూడు పార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఆ వివరాలను గవర్నర్‌ను కలిసి అందజేశామని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానించాలని కోరామన్నారు. సాయంత్రం గవర్నర్ కార్యాలయం నుంచి రాజ్యంగపరంగా పిలుపు వస్తుందన్నారు. బుధవారం నాడు చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. జనసేన పీఏసీ ఛైర్మ్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. ఈ విజయం ప్రజల విజయంగా భావిస్తున్నామన్నారు. గవర్నర్‌కు కూటమి తరపున కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరామన్నారు. ఇది రాజ్యంగ పరమైన పక్రియ అని.. గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తారని నాదెండ్ల చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం, సుపారిపాలన కూటమితోనే సాధ్యం అని చెప్పారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తవగా.. చిన్న చిన్న పనులను సైతం పూర్తి చేస్తున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, సినీ ప్రముఖులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నాయి. గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలో చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఆయన చేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు. అందుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బరిలో నిలిచి గెలిచింది. 175 అసెంబ్లీ స్థానాలకు గాను 164 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటు చేయాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబును ఏపీ గవర్నర్ కోరారు. ఉదయం విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో కూటమి ఎమ్మెల్యేలంతా చంద్రబాబును పార్టీ నేతగా ఎన్నుకున్నారు. ఇక కూటమిలోని జనసేన. బీజేపీ ఎమ్మెల్యేలకు కీలక మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నట్లు ఓ చర్చ సైతం సాగుతుంది. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో బుధవారం విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విజయవాడ నగరం నుంచి గన్నవరం వెళ్లే వాహనాలను పోలీసులు మళ్లించనున్నారు. విజయవాడ రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి వెళ్లే వాహనాలతో పాటు.. అంబులెన్స్, అత్యవసర ఆరోగ్య చికిత్స వాహనాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. అలాగే గన్నవరం వెళ్ళే ఇతర వాహనాలు అన్నిటినీ నిలిపి వేయనున్నారు. కేవలం పాసులు ఉన్న వారికే అనుమతి ఇవ్వనున్నారు. ఇక విజయవాడలో సాధారణ వాహనలు కూడా మళ్లించనున్నారు. విజయవాడ నుంచి ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుంచి కంకిపాడు-పామర్రు-హనుమాన్ జంక్షన్-ఏలూరు వైపు మళ్లిస్తారు. అలాగే.. వియవాడ వెలుపల ట్రాన్స్ పోర్టు వాహనాలను మళ్లించనున్నారు.

# వామ్మో జూన్..

(మొదటి పేజీ తరువాయి)

కూడబెట్టుకున్న దానికి మరికొంత అప్పు చేసి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఏటా రైతులకు వానాకాలం సీజన్ భారంగా మారుతోంది. ఈ యాసంగి పంటలు పండినా ధాన్యం డబ్బు చేతికి రాని దైన్య స్థితిలో రైతులు ఉ న్నారు. వ్యవసాయ పనులూ అంతంతే. ఇతరత్రా కూలీ పనులు దొరక్క గ్రామీణుల్దు ఉపాధి పనుల కు వెళ్లినా కొద్ది రోజులుగా డబ్బులు అందక వారి పరిస్థితి గందరగోళంగా ఉంది. మండుతున్న ఎండల్లో ఉపాధి పనులకు వెళ్తే రూ.200 నుంచి రూ. 250 వరకు దక్కడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీ ఫ్‌నకు సంబంధించి ఎరువులు, విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో సరిపడా రుణాలు లభించక అప్పు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. పిల్లల చదువు, వ్యవసాయ ఖర్చులు అంచనా వేయలేని స్థితి ఏర్పడడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన నెలకొంది.

**స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టండి: మంత్రి పొన్నం**

తెలంగాణ వ్యాప్తంగా పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. మంగళవారం రవాణాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి స్కూల్ బస్సు తనిఖీ చేయాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని చెప్పారు. వారం రోజులపాటు స్కూళ్లు, కాలేజీల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 'కారు డోర్‌లకు బ్లాక్ ఫిల్మ్ గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలి. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయం పెంచుకోవచ్చు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి పాలసీలో ఉన్న విధంగా వ్యవహరించాలి. వాహనాలను భద్రపర్చే ప్రదేశాలపై జిల్లా పోలీస్ అధికారులతో కో-ఆర్డినేట్ చేసుకోవాలి. హైదరాబాద్‌లో ఆటోరిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సీఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలి' అని అధికారులకు దిశానిర్దేశర చేశారు.





# రామోజీ మరణం తీరని లోటు

**కటుంబ సభ్యులకు సిఎం రేవంత్ పరామర్శ**

హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం): రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరిన రామోజీరావు చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆరోజు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో ఉండటంతో రామోజీరావు పార్థివదేహానికి నివాళు లర్పించ లేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించాలని అధికారులను



ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఫిల్మ్‌సిటీలోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రామోజీరావు చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని 'ఈనాడు' ఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరితో పంచుకున్నారు. రామోజీరావు వ్యక్తి కాదు వ్యవస్థ.. ఆయనకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రామోజీ చూపిన మార్గంలో వారి కుటుంబ సభ్యులు, సంస్థలు ప్రజల తరఫున నిలబడాలని ఆకాక్షించారు. ఆయన ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు సీఎం వెంట ఉన్నారు. అలాగే దివంగత రామోజీరావుకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి నివాళులర్పించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని ఆయన నివాసానికి వచ్చిన ఇంద్రసేనారెడ్డి.. రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగు ప్రజలు అభిమానించే రామోజీరావు.. అందరికీ ఆర్యప్రాయు డని తెలిపారు. ఆయన మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు. రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# పరుగులు తీస్తున్న కృష్ణమ్మా...

(మొదటి పేజీ తరువాయి)

చేరికతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువవుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టిఎంసిలకు గాను 5.547 టిఎంసిలు నీరు చేరడంతో మరో వారంలోగా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని అధికారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేసేందుకు సన్నద్ధమవుతుండగా తాజాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి కూడా నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.
అదే విధంగా ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టిఎంసిలకు గాను 22.51 టిఎంసిల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయంలో 37.646 టిఎంసిలకు గాను 24.36 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జూరాలకు ముందస్తుగా వర్షపు చేరికతో పూర్తి స్థాయి మట్టానికి చేరుకుంటుండడంతో ఆయకట్టు రైతులు ముందస్తు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

**పసుపాల వద్ద....**

కర్నాటక ప్రాంతంతో పాటు, ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదిలో వరద నీరు వచ్చిచేరుతోంది. కర్ణాటకలోని కర్ణాటక- తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న రాయిచూర్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం కోసం గుర్జాపూర్ బ్యారేజీ లో భారీగా వరద నీరు చేరడంతో బ్యారేజీ గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు తంగిడి ఎగువ భాగంలో భీమా నదిపై ఉన్న గిరిజాపూర్ డ్యామ్ గేట్ల పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో వరద జలాలు సైతం కృష్ణానదీలోకి కలుస్తున్నాయి.దీంతో మక్తల్ మండల పరిధిలోని పసుపుల గ్రామం వద్ద శ్రీపాద వల్లభుని ఆలయం సమీపంలో క్రిష్ణమ్మ నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతోంది. వరద ప్రవాహం పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరగానే ప్రాజెక్టులు నిండి ఎలాంటి సాగు నీటి ఇబ్బందులు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరికలు...**

కర్ణాటక నుండి తెలంగాణ రాష్ట్రంలో మక్తల్ నియోజక వర్గంలో క్రిష్ణా నది వరద ప్రవాహం క్రమంగా పెరగడంతో కృష్ణ, మాగనూరు, మక్తల్ మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతం గ్రామాల్లో ముందుస్తుగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు హెచ్చరి కలు జారీ చేశారు.

# సమాచార కమిషనర్లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్,జూన్11(నమస్తే ఉదయం): ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈనెల 29లోపు దరఖాస్తులు పంపిం చాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.
గత ప్రభుత్వ హయాంలోనూ సమాచార కమిషనర్ల నియామకానికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు.

# తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదాకరమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు. ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలను గుర్తించామని.. అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబంధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయాన్ని కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయెల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

# తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రెండో సెషన్ 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 87శాతం హాజరు శాతం నమోదైంది. ఈ ఏడాది నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎడ్‌సెట్ పరీక్షల బాధ్యత చేపట్టింది. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్ల బీఎడ్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో మొత్తం 14285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# వారసులకే మంత్రిపదవుల్లో పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం తూర్పారబట్టారు. ఎన్‌డిఎ మంత్రివర్గాన్ని 'పరివార్ మండల్' అని ఆయన అభివర్ణించారు. మోడీ 3.0 ప్రభుత్వంలో పలువురు మంత్రులు రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారేనని రాహుల్ పేర్కొన్నారు. 'తరాల పోరాట సంప్రదాయాన్ని, సేవను, త్యాగాన్ని ఆశ్రితపక్షపాతంగా పేర్కొనేవారు తమ 'సర్కారీ పరివార్'కు అధికార విల్లును పంచిపెడుతున్నారు' అని రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో ఆరోపించారు. 'మాటలు, చేతలకు మధ్య ఈ తేడా పేరు నరేంద్ర మోడీ' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎన్‌డిఎ 'పరివార్ మండల్'లో భాగంగా మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ కుమారుడు హెచ్‌డి కుమారస్వామి, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ తొలి ప్రో టెమ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె రక్షా ఖడ్సే, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ మనుమడు జయంత్ చౌదరి, మాజీ కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్, మాజీ ఎంపి, మధ్య ప్రదేశ్ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు జెపి నడ్డా పేర్లను రాహుల్ తన పోస్ట్‌లో ప్రస్తావించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్ నాథ్ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడు కుమారుడు రామ్ మోహన్ నాయుడు, మాజీ ఎంని జితేంద్ర ప్రసాద కుమారుడు జితిన్ ప్రసాద, హర్యానా మాజీ ముఖ్యమంత్రి రావు బీరేంద్ర సింగ్ కుమారుడు రావు ఇందర్జీత్ సింగ్, మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియంత్ సింగ్ మనుమడు రవ్‌నీత్ సింగ్ బిట్టు, అప్నా దళ్ వ్యవస్థాపకుడు సోనేలాల్ పటేల్ కుమార్తె అనుప్రియా పటేల్, ఉత్తర ప్రదేశ మాజీ మంత్రి మహారాజ్ ఆనంద్ సింగ్ కుమారుడు కీర్తి వర్ధమాన్

# విద్యుత్ కొనుగోళ్ల దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

వరకు సమయం అడిగారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో.. పదేళ్లు సీఎంగా ఉన్న సమయంలో విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలకు సంబంధించిన విషయాలపై.. మీ పాత్ర ఏంటో చెప్పాలంటూ పవర్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. 2024, జూన్ 30వ తేదీలోపు కేసీఆర్ సమాధానం ఇవ్వాలంటూ నోటీసుల్లో స్పష్టం చేసింది పవర్ కమిషన్. దీనిపై కేసీఆర్ బృందం స్పందించిందని.. జూలై 30వ తేదీలోపు సమాధానం ఇవ్వటానికి సమయం కావాలని కేసీఆర్ కోరినట్లు కమిషన్ వెల్లడించింది. జూన్ 30వ తేదీలోపు సమాధానం చెప్పాలని కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని కమిషన్ వివరించింది. జూన్ 30వ తేదీలోపు లిఖితపూర్వక సమాధానం ఇవ్వాల్సి ఉంది కేసీఆర్.. ఆ సమాధానంపై కమిషన్ సంతృప్తి చెందకపోతే.. నేరుగా విచారణకు కేసీఆర్ హాజరుకావాల్సి ఉంటుంది . భద్రాద్రి, యాదాద్రి, ఛత్తీస్ ఘడ్ విద్యుత్ ఒప్పందాలపై అప్పటి సీఎంగా కేసీఆర్ పాత్రపై ఉన్న అనుమానాలు, లోగుట్టుపై ఉన్న సందేహాలకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.



## క్రిష్ణా నదిలో పెరిగిన వరద...

### హెచ్చరించినా పుట్టిల ద్వార జనం చేరవేత...

**మక్తల్,జూన్ 11(నమస్తే ఉదయం):**
క్రిష్ణా నదిలా వరద నీటితో నీటిమట్టం పెరిగి బండరాళ్లు మునిగి నది రెండు వైపుల (దారులు) అంచులు కలసి పారుతు వరద నీరు దిగువ జూరాల ప్రాజెక్టు వైపు పరుగెడుతున్నాయి. హెచ్చరికలు ఉన్నా వరద నీటిలో పుట్టిల ద్వార ప్రయాణీకులను చేర వేస్తున్నారు.
గత వారం రోజులుగా కర్నాటక లో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఎగువ భాగమున బారిగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు నదిలో చేరడం వల్లా క్రిష్ణమ్మ వరద పెరిగింది. ఈ వరద కారణంగా దిగువన ఉన్న రోడ్డు కం బ్యారేజిలు నీటి మట్టం పెరిగ్గా వచ్చిన వరద నీరు దిగువకు వదిలేందుకు షట్టర్లు పైకెత్తెందు కు ప్రయత్నించగా మొరాయించిన సంఘటనలు ఉన్నాయి,
కర్ణాటక నుండి తెలంగాణ రాష్ట్రంలో మక్తల్ నియోజక వర్గంలో క్రిష్ణా నది ప్రవేశించడంతో కృష్ణ, మాగనూరు, మక్తల్ మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతం గ్రామాల్లో ముందుస్తుగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు హెచ్చరి కలు జాగ్రత్తలను తీసుకున్నారు. అయితే కృష్ణ నదిలో వరద ఉన్నా కూడా నదిలో కర్నాటక తెలంగాణ మక్తల్ మండలంలోని పస్పుల,పాటి గ్రామాల పరివాహక సరిహద్దు ప్రజలను పుట్టిలో ప్రజలను అటు ఇటు చేరవేస్తున్నారు.

## లక్కి డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**
బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులు ఉచితంగా చదివేందుకు నిబంధనల ప్రకారం లక్కి డిప్ ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో నిర్దేశించిన ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరేందుకు 57 సీట్లు (నాన్ రెసిడెన్షియల్), ఐదో తరగతిలో చేరేందుకు 59 సీట్లు (రెసిడెన్షియల్) కేటాయించగా మొత్తం 833 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నా రన్నారు. వీరిలో 33% రిజర్వేషన్లు బాలి కలకు కేటాయించగా, మిగిలిన సీట్లను జనరల్ కోటాలో లక్కిడిప్ తీసినట్లు చెప్పారు. అదేవిధంగా ఆయా తరగతిలో రిజర్వేషన్లు ఉన్న బాలికలు, జనరల్ కోటాలో పది మంది చొప్పున అదనంగా వెయిటింగ్ లిస్టులో ఉంచేందుకు విద్యార్థులను ఎంపిక చేశారు.




ఎంపికైన విద్యార్థులు ఆయా తరగతుల్లో చేరకుంటే ప్రాధాన్య క్రమంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లు కేటాయిస్తామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారిని శ్వేతా ప్రియదర్శిని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 12న తమ ధృవపత్రాలను తీసుకొని ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్.సి కార్పోరేషన్ ఈడీ రమేష్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారిని ఇందిర, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## చెకింగ్ కాని సి.యు.లు, బి.యు.లు, వివి ప్యాట్లు హైదరాబాద్‌కు తరలింపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**
ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గద్వాల్ , అలంపూర్ సెగ్మెంట్లకు సంబంధించిన సి – కేటగిరి మరియు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కాని సి.యు.లు, బి.యు.లు, వివి ప్యాట్లను వివిధ రాజకీయ పార్టీ



ప్రతినిధుల సమక్షంలో భద్రంగా ఈ.సి.ఐ.ఎల్ ,ఈ.ఎస్.ఎం.డి హైదరాబాద్ కు మంగళవారం తరలించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ ( స్తానిక సంస్థలు ) అపూర్వ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సి – సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ , ఎన్నికల సిబ్బంది , వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారిని ఆశీర్వదించిన మదనాపురం ఎంపీపీ జన్ను పద్మావతి వెంకట్ నారాయణ

**కొత్తకోట, జూన్11(నమస్తే ఉదయం):** మదనాపురం మండలం కొన్నూర్ తండాలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పండూ నాయక్ కూతురు అమ్మాయి ఫంక్షన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ఎంపీపీ జన్ను పద్మావతి వెంకట్ నారాయణ, నాయకులు మూల మళ్ళ భీమ్ రెడ్డి , వడ్డే రాములు, ఎం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## ఫిట్నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**
జిల్లా వ్యాప్తంగా ఫిట్ నెస్ లేకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సులను గుర్తించి వాటిని వెంటనే సీజ్ చేసి, నూతన బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్– రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పేరు సుభాన్,పవన్, పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి హలీంపాషా, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫిట్ నెస్ లేని బస్సులను గుర్తించి సీజ్ చేయాలని మంగళవారం జిల్లా రవాణ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం మే 15లోగా స్కూల్ బస్సులకు ఫిట్ నెస్ చేయించాల్సి ఉండగా స్కూల్స్ యాజమాన్యం గడువు దాటినప్పటికి పూర్తిస్థాయిలో బస్సులకు సామర్థ్య ఫిట్నెస్ పరీక్షలు చేయించని పరిస్థితి నేడు జిల్లాలో కనిపిస్తుందని అన్నారు. కావున ఫిట్నెస్ లేని బస్సు లకు ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేయవద్దని కోరారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ బస్సులు ఫిట్ నెస్ లేకుండా తిరుగుతున్నాయని, అనుభవం లేని, లైసెన్స్ లేని డ్రైవర్లచే బస్సులను నడిపించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురై అవకాశాలున్నాయన్నారు. స్కూల్ బస్ లలో ఫైర్ సేఫ్టీ,



ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మిడిల్ రాడ్స్, విండోస్ దగ్గర సైడులకు జాలి లేకుండానే పాత బస్ లకు కొత్త రంగులు అద్ది ఫిట్నెస్ తేవడం కోసం విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థి, తల్లితండ్రులను, అధికారులను మభ్యపెడుతున్నారాని వారి పై వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అధికారులు దీనిపై దృష్టి సారించి ముందస్తుగా అప్రమత్తత పాటించాలని, ఫిట్ నెస్ లేకుండా సరైన నిబంధనలు పాటించని, బస్సులను సీజ్ చేయాలని అలా బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## క్రీడలు యువతి యువకుల్లో క్రమశిక్షణ పెంపొందిస్తాయి..

### - బిజెపి నాయకుడు ప్రేమ్ రాజ్

**శంషాబాద్, జూన్ 11( నమస్తే ఉదయం):**
క్రీడలు యువతి యువకుల్లో క్రమశిక్షణను పెంపొందిస్థాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండపల్లి బిజెపి నాయకుడు కొండా పరమేష్ గౌడ్ ఆధ్వ ర్యంలో ఎంపీఎస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వ హించారు. మున్సిపల్ బిజెపి నాయకుడు. కొండ పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ ముగింపు కార్య క్రమానికి ప్రేమ రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం జరిగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కప్పును కొండ పరమేష్ గౌడ్. డాక్టర్ ప్రేమ్ రాజ్ అందజేశారు. మునిసిపల్ బిజెపి అధ్యక్షుడు దేవేందర్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి. స్థానిక నాయకులు పెదిరిపాటి శేఖర్ గౌడ్. దొడ్డ పెంటయ్య. సుఖేందర్. సుదర్శన్ రెడ్డి. అఖిల్. రాజు. చంటి. దామోదర్. అరుణ్. తదితరులు పాల్గొన్నారు. ఫైనల్‌లొ శంషాబాద్ టీంతో దుపల్లి టీం తలపడడం జరిగింది. ఫైనల్లో శంషాబాద్ టీం కెప్టెన్ సుజిత్ జట్టు మ్యాచ్ విన్ అయింది తొండపల్లి టీం కెప్టెన్ రాజు సచిన్ వైస్ కెప్టెన్ క్యామ మహేష్ రన్నర్ ఆఫ్‌గా నిలిచింద విన్నర్ టీంకి గోల్డెన్ కప్ అంద




జేయడం జరిగింది తొండుపల్లి టీంకి రన్నర్ కప్ అంద జేయడం జరిగింది.

## గృహ జ్యోతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే అమలు చేయాలి : సీపీఐ డిమాండ్

**రాజేంద్రనగర్, జూన్11(నమస్తే ఉదయం):**
గృహ జ్యోతి పథకాన్ని అమలు చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాజేంద్రనగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియడంతో ఆరు గ్యారంటీలను అమలు చేయాల న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే గృహజ్యోతి పథకం అమలు చేస్తామని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. గృహ జ్యోతి పథకం క్రింద వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో క్రింద బిల్లులు అమలు చేయాలి అన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలు చేస్తు న్నారని, రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రేటర్ పరిధిలో వచ్చే అని డివిజన్‌లలో కూడా అమలు చేయాల న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలు, మహిళలకు రూ. 2500లు , గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇంకా అనేకమైనటువంటి హామీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇచ్చినటువంటి అన్ని హామీలను అమలు చేయాల




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనంపల్లి జైపాల్ రెడ్డి, తదితరులు

న్నారు. అమలు చేయకుంటే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు ఇ.నిరంజన్ గౌడ్, జి.సత్యం పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కమిటీ వెయ్యాలి...

### - డాక్టర్ ప్రేమ్ కుమార్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):**
నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కమిటీ వెయ్యాలని డాక్టర్. ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎంతో మంది కష్టపడీ చదివి రాసిన నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాల పై విచారణ కమిటీ నియమించాలన్నారు...ఒకే సెంటర్ లో ఎగ్జామ్ రాసిన విద్యార్తులందరికీ టాప్ ర్యాంక్ లు రావడం ,అనుమానాలకు తావిస్తుంది,ఇలా జరగడం కష్టపడిన విద్యార్థుల శ్రమ ను దొచుకోవడమే అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్య ను వ్యాపారంగా మార్చి కోట్లు, కోట్లు సంపాదిస్తూ విద్యార్తుల జీవితాలతో ఆడుకుంటున్నయని..విద్యార్థుల శ్రమను, జ్ఞానం ను, కాలాన్ని వారి జీవితాల్ని కార్పొరేట్ విద్యసంస్థలు నాశనం చేశాయని, విద్యార్థుల కు జ్ఞానం కాకుండా.. మార్కులు సంపాదించే మర యంత్రాలుగా తయారు చేస్తున్న.. ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా సంస్థల ను నిరోధించకపోతే... కార్పొరేట్ విద్యా



మాఫీయాగా తయారు అవుతుందని, నీట్ ఎగ్జామ్ విషయం లో విద్యార్థులకు, వారి తల్లి,దండ్రులకు ఉన్న అనుమానాల్ని నివృత్తి చెయ్యాలనీ, లేనియెడల అన్ని కార్పొరేట్ విద్యా సంస్థల ను ముట్టడించి, తదుపరి కార్యచరణ చేపడతామని, సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.



ఎంపీ రఘునందన్ రావుకు పుష్ప గుచ్చం అందజేస్తున్న బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి

## ఎయిర్‌పోర్టులో రఘునందన్ రావుకు ఘన స్వాగతం...

**శంషాబాద్,జూన్ 11(నమస్తే ఉదయం):**
మంగళవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు కు ఘన స్వాగతం లభించింది. రఘునందన్ రావు మెదక్ ఎంపీగా గెలిచిన తర్వాత మొదటి సారిగా ఢిల్లీ నుండి హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా రఘునందన్ రావు కు బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.
జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్. బండి శీను. శ్రీకాంత్. లింగం మహేష్. భరత్. సాయి. ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణి మృతిపై విచారణ

## ప్రవేటు ఆసుపత్రిలో అకస్మిక తనిఖీలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ గర్భిణి మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ శశికళ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.కె సిద్ధప్ప గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర మదర్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ నెల 8న మృతి చెందిన



కుర్వపల్లి గ్రామానికి గర్భిణీ స్త్రీ శివలీలకు సంబంధించిన ఐపి రిజిస్టర్, ఓటి రిజిస్టర్ , ల్యాబ్ రిపోర్ట్స్, స్కానింగ్ రిపోర్ట్స్, సి - సెక్షన్ రిజిస్టర్ డెలివరీ రిజిస్టర్ తనిఖీ చేసి రికార్డులను, రిపోర్టులను హ్యాండ్ ఓవర్ చేసుకున్నారు. అనంతరం ఈ కేసుకు సంబంధించిన రిపోర్టును జిల్లా కలెక్టర్ కు నివేధిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా చింతలపేట లోని సూరజ్ క్లీనిక్ ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సమయంలో ఈ క్లినిక్ నందు క్వాలిఫైడ్ డాక్టర్ కాకుండా ఇతర వ్యక్తులు రోగులకు చికిత్సలు అందిస్తున్నందువల్ల ఈ క్లినిక్ కి నోటీసు అందజేశారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు ఇంచార్జ్ - డిప్యూటీ డెమో కే.మధుసూదన్ రెడ్డి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ ఇన్చార్జ్ జి. నరసయ్య పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

## రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డీసీ కె.రవికుమార్

**రాజేంద్రనగర్,జూన్11(నమస్తే ఉదయం):** రానున్న బక్రీద్ పర్వదిన వేడుకల్లో పారిశుద్ధ్యం పట్ల సర్కిల్ సిబ్బంది అప్రమత్తతతో పని చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ సూచించారు.మంగళవారం ఈ మేరకు



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎస్ఎఫ్ఏలు,ఎస్ ఎస్లు,డిప్యూటీ ఎస్డబ్ల్యూఎంలతో కలిసి హాజరయ్యారు.అనంతరం కమిషనర్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బక్రీద్ వేడుకల్లో వ్యర్థ పదారాలు ప్రధాన రహదారులు, కాలనీలు, బస్తీలలో పడేయకుండా చూసుకోవాలన్నారు.ఈ మేరకు సర్కిల్ సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి,వ్యర్థ పదార్థాలు రోడ్లపై పాడేయకుండా నల్ల కవర్లు అందజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

**రాజేంద్రనగర్, జూన్11(నమస్తే ఉదయం):** నేటి (బుధవారం) నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. అందుకోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో అన్ని సౌకర్యాలను కల్పించారు. 48 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులందరు ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. నూతన తరగతిలో చేదడానికి కావలసిన పుస్తకాలు , బ్యాగులు, స్కూల్ డ్రెస్ లు కొనుగోలు చేసి ఉత్సాహంగా స్కూల్ కి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో నూతన విద్యార్థులను చేర్చుకునేలా ఉపాధ్యాయులు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు . విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో



పాఠశాలలో చేర్చుకునేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. బడిబాట ద్వారా పాఠశాల బయట ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు గల పిల్లలందరూ పాఠశాలలో ఉండి చదువుకునేలా ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారు.

# జూరాలకు జలకళ



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 11(నమస్తే ఉదయం):** సాగు, తాగునీటి కోసం గత యాసంగిలో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డ నడిగడ్డ ప్రజలకు వరుణదేవుడి కరుణతో ముందస్తు వర్షాలు మురిపించాయి. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు కృషా ణపరివాహక ప్రాంతాలు, జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు వచ్చి నీరు చేరు తుండడంతో రోజు రోజుకూ ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. మంగళవారం జూరాల జలాశయానికి ఎగువ ప్రాంతం నుండి 7,211 క్యూసెక్కుల వరదనీరు వర్చి చేరుతుండడంతో జూరాల జలాశయంలో 5.547 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

దీంతో ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుండి వరద రాకున్నప్పటికీ వర్షపు నీరు చేరికతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువవుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టిఎంసిలకు గాను 5.547 టిఎంసిలు నీరు చేరడంతో మరో వారంలోగా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని అధికారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేసేం దుకు సన్నద్ధమవుతుండగా తాజాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి కూడా నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవు తున్నట్టు తెలిసింది.

అదే విధంగా ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టిఎంసిలకు గాను 22.51 టిఎంసిల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయంలో 37.646 టిఎంసిలకు గాను 24.36 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జూరాలకు ముందస్తుగా వర్షపు చేరికతో పూర్తి స్థాయి మట్టానికి చేరుకుంటుండడంతో ఆయకట్టు రైతులు ముందస్తు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.









ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సి పి రాధాకృష్ణన్, విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్న గవర్నర్, క్యాన్సిలర్ సిపి రామచంద్రన్

## భారత ఆర్థిక పురోభివృద్ధిలో

# యువతదే కీలకపాత్ర

### తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్

### ఘనంగా తెలంగాణ ఉద్యన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం

**ములుగు, జూన్11(నమస్తే ఉదయం):** 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు లో మంగళవారం జరిగిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ... భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు.

తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత అలాగే పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూపర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి అన్నారు.లి స్నాతకోత్వానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.... ప్రెసిషన్ ఫామింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేదస్సు, రోబోట్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందని ఆమె అన్నారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో, పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలని అన్నారు. స్పీడ్ బ్రేకింగ్ ఉంటాయి ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడు సంవత్సరాల్లోనే పూర్తవుతుంది అన్నారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని డాక్టర్ గీతా లక్ష్మి పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలని నైపుణ్యభారత్ కు సైతం ఇది దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. కష్టపడే లక్షణం విద్యార్థులు అలవర్చుకుంటే విజయం తప్పక వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ బి. నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం, అలాగే అభివృద్ధి నివేదికను గవర్నర్ కు విన్నవించారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందని, అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలనగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపు తోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్ పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి ఆమె తెలిపారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన ఉద్యాన దర్శిని ప్రచురణతో పాటు గ్రామాల దత్తత, విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అంద అందజేస్తున్నట్లు డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు.

#### విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానం

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్కు చెందిన ఆర్. వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బిఎస్సి హానర్స్ ఫారెస్ట్రీలో పిసిసిఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళిబీ డీన్స్ గోల్డ్ మెడల్ కె.ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టి కల్చర్లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించి నందుకు గాను ఎస్కేఎల్ టి ఎస్ హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జివెస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

#### విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డ్ డాక్టరేట్ పట్టాలు ప్రధానం .

కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డిఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథుర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి



ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపోద్ఘాతాన్ని చదువుతున్న ఉపకులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.